ప్రజాశక్తి

గురువారం 21 డిసెంబరు 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

విజయవాడలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమ ంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి తదితరులు

క్షమాగుణమే క్రీస్తు మార్గం

● సెమీ క్రిస్మస్ వేడుకల్లో సిఎం జగన్

వార్త మెయిన్‌లో

ఎమ్‌డి చక్రధర్ బాబు నుండి అవార్డు అందుకుంటున్న విఎంసి అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.సత్యవతి, చీఫ్ సివిల్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్‌రావు, ఇఇ వెంకటేశ్వరరెడ్డి తదితరులు

ఇంధన పొదుపులో విఎంసికి స్వర్ణం

ప్రజాశక్తి - విజయవాడ : ఇంధన సంరక్షణ, అందుబాటులో ఉన్న శక్తిని సమర్థవంతంగా వినియోగించుకోవడంలో అద్భుతమైన పనితీరును కనబర్చినందుకు గాను విజయవాడ నగరపాలక సంస్థ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు (ఎస్ఇసిఎ)-2023లో ప్రథమ స్థానం (స్వర్ణం) దక్కింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఎపిఎస్ఇసిఎం) ఎనర్జీ డిపార్ట్మెంట్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ అవార్డును విఎంసికి ప్రదానం చేశారు. నగరంలోని ఎంజి రోడ్‌లోని హోటల్ వివంతలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విజయవాడ నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.సత్యవతి, చీఫ్ సివిల్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఎపి జెన్కో మానేజింగ్ డైరెక్టర్, ఎపి ట్రాన్స్‌కో జెఎండి కెవిఎన్ చక్రధర్ బాబు అవార్డును అంద జేశారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు 2023ను మొత్తం 3 కేటగిరీలో నిర్వహించారు. మొదటిది ఇండస్ట్రీస్, రెండోది బిల్డింగ్స్, మూడోది ఇన్స్టిట్యూషన్స్ (యుఎల్‌బి). విఎంసికి యుఎల్‌బి క్యాటగిరిలో(సబ్ క్యాటగిరీ 7) స్వర్ణం దక్కించుకుంది.

వైసిపిలో అనూహ్యం !

- విజయవాడ ఎంపి అభ్యర్థిగా వంశీ ?
- పెనమలూరుకు దేవినేని అవినాష్
- విజయవాడ తూర్పుకు ఉదయభాను
- సగానికిపైగా నియోజకవర్గాల్లో మార్పులు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

అధికారపక్షంలో 2024 ఎన్నికల హీట్ పెరిగింది. రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. వైసిపి అనూహ్య వ్యూహాలకు తెరతీసింది. అత్యంత పకడ్బంధీగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపడుతున్న ఆ పార్టీ అధిష్టానం ఆ వివరాలను కూడా అంతే గోప్యంగా ఉంచుతున్నట్లు తెలిసింది. ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటి వరకు నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానాలను మార్పు చేయాలనే నిర్ణయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చినట్లు తెలిసింది. అలాగే మరో రెండు అసెంబ్లీ స్థానాలకు కొత్త అభ్యర్థులను రంగంలోకి దింపాలని చూస్తున్నట్లు సమాచారం. ఆ రెండు ఎస్సీ రిజర్వ్‌ర్డు నియోజక వర్గాలు కావడం గమనార్హం. ప్రస్తుత వైసిపి నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధికి బదులుగా కొత్త అభ్యర్థులను పరిశీలిస్తున్నట్లు ఆ పార్టీలో చర్చ సాగుతోంది. జగన్‌మోహన్‌రావుకు బదులుగా ముఖ్యమంత్రి సెక్యూరిటీకి చెందిన ఓ అధికారి మరదలను నందిగామలో దించాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అలాగే తిరువూరులో కూడా ఉద్యోగ విరమణ పొందిన అధికారిని నిలిపే యోచనలో ఉన్నట్లు సమాచారం. తక్కిన ఐదు నియోజకవర్గాల్లో కూడా అభ్యర్థుల స్థానాలు మారనున్నట్లు సమాచారం. అభ్యర్థుల సామాజికవర్గం, ఆయా నియోజకవర్గాల్లో ఉన్న మెజారిటీగా సామాజిక, వారి ప్రాబల్యం ఆధారంగా మార్పులు జరుగుతున్నట్లు సమాచారం. జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయ భానుకు విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది. ఇప్పటి విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న దేవినేని అవినాష్‌ను కృష్ణాజిల్లా పెనుమలూరు నియోజక వర్గ ఇన్చార్జిగా మార్చనున్నట్లు తెలిసింది. ఎంఎల్ఎ వసంత కృష్ణప్రసాద్‌ను మైలవరం నుంచి తప్పించి జగ్గయ్యపేట నియోజవర్గ ఇన్చార్జిగా ఉండాలని కోరినట్లు తెలిసింది. అయితే ఆయన అందుకు సుముఖత వ్యక్తం చేయలేదని సమాచారం. తాను ఈసారి ఎన్నికల్లో అసలు ఎక్కడ నుండీ పోటీచేయబోనని చెప్పినట్లు తెలిసింది. ఉమ్మడి కృష్ణాజిల్లా మంత్రి జోగి రమేష్‌ను ఈ దఫా (మిగతా 6లో)

పశ్చిమం మేయర్ భాగ్యలక్ష్మికి?

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ టికెట్‌ను ఈసారి బిసిలకు కేటాయించాలనే ఆలోచనలో వైసిపి అధిష్టానం ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేరు తెరపైకి వస్తోంది. ఒకవేళ ముస్లిం మైనారిటీలకు కేటాయిస్తే ఎపి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న షేక్ ఆసీఫ్ రంగంలో ఉంటారని సమాచారం. అలాగే నిమ్రా కళాశాల అధిపతి మహ్మద్ సాఖిబ్ రసూల్ ఖాన్ పేరును కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే నియోజకవర్గంలో (మిగతా 6లో)

కరోనా అప్రమత్తం !

- నేటి నుంచి విమానాశ్రయంలో పరీక్షలు
- ఆస్పత్రుల్లో ఐసొలేషన్ వార్డులు, కిట్లు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కరోనా నూతన వేరియంట్ వ్యాపిస్తోందని సంకేతాలు అందడంతో కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. జిల్లాలో వ్యాధివ్యాప్తి నియంత్రణకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా గన్నవరం విమా నాశ్రయంలో వ్యాధి లక్షణాలున్న అనుమానిత విమాన ప్రయాణీకులకు పరీక్షలు చేయడానికి ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి విమానాశ్రయంలో ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు చేస్తారు. జిల్లా కేంద్రం మచిలీపట్నం లోని మెడికల్ కళాశాల పర్యవేక్షణలో ఉన్న ఆస్పత్రితోపాటు ఏడు నెట్‌వర్క్ ఆస్పత్రులు, సామాజిక కేంద్రాల్లో ఐసొలేటెడ్ వార్డులు, బెడ్లను సిద్ధం చేస్తున్నారు. జ్వరాలు, జలుబు తదితర లక్షణాలతో ఉన్నవారికి కరోనా పరీక్షలు నిర్వహించడానికి జిల్లాలో ఏర్పాట్లు చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహణకు, చికిత్స అందించడానికి వైద్యులు, సిబ్బందికి అవసరమైన కిట్లు, గ్లౌజులు, మాస్కులు అందుబాటులో ఉంచారు. వ్యాధి నిర్ధారణ అయిన వారిని ఐసొలేటెడ్ వార్డులకు తరలించ నున్నారు. మచిలీపట్నం ఆస్పత్రిలో 40 బెడ్లతో ఐసొలేషన్ వార్డులు ఏర్పాటు చేశారు. ఒక్కో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో (పిహెచ్‌సి) ఆరు బెడ్ల చొప్పున జిల్లాలోని 53 పిహెచ్‌సిల్లో బెడ్లను అందుబాటులో ఉంచారు. గుడివాడ ఏరియా ఆస్పత్రి, ఏడు సామాజిక కేంద్రాల్లో ప్రత్యేక వార్డులు సిద్ధం చేశారు. జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆస్పత్రుల్లో 100కు పైగా ఆక్సిజన్ బెడ్లు అందుబాటులో ఉంచారు. ఒక్కో ఆస్పత్రిలోని ప్రత్యేక వార్డులో 20 ఆక్సిజన్ బెడ్లను అందుబాటులో ఉంచాలని జిల్లాలోని ఏడు నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ, ప్రయివేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో మొత్తం 200కుపైగా ఆక్సిజల్ బెడ్లు అందుబాటులో ఉంచారు.

సన్నద్ధంగా ఉన్నాం

గీతాబాయి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

ప్రభుత్వ మార్గదర్శకాలకు అను గుణంగా కరోనా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. నూతన వేరియంట్ వ్యాప్తి చెందకుండా పరీక్షలు చేయడానికి కిట్లను అందుబాటులో ఉంచాం. వ్యాధి లక్షణాలున్న అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తాం. అవసరమైన ఐసోలేషన్ కేంద్రాలు, బెడ్లు, ఆక్సిజన్ బెడ్లు అందు బాటులో ఉంచాం. జిల్లాలోని ఆస్పత్రులు, పిహెచ్‌సిలు, సామాజిక ఆస్పత్రులు, నెట్‌వర్కు ఆసుపత్రుల్లో వైద్యులను అప్రమత్తం చేశాం.

భళా...బాలల కళ..!

(పూర్తి వివరాలు 4, 5 పేజీల్లో)

(వార్తలు లోపలి పేజీల్లో)

విజయవాడలో చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు; మచిలీపట్నంలో వంటా వార్పు.

ఉద్యమం ఉధృతం

- తొమ్మిదో రోజుకు అంగన్వాడీల సమ్మె
- వివిధ రూపాల్లో నిరసనలు

ఉద్యమం ఉధృతం

• తొమ్మిదో రోజుకు అంగన్‌వాడీల సమ్మె • ఎన్‌టిఆర్ జిల్లాలో వివిధ రూపాల్లో నిరసనలు

ఎన్‌టిఆర్ జిల్లాలో అంగన్‌వాడీల సమ్మె ఉధృత రూపం దాల్చింది. తొమ్మిదో రోజు బుధవారమూ వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగాయి. ఈ సందర్భంగా వివిధ మండలాల్లో మానవహారాలు, భిక్షాటన, వంటావార్పు, చెవిలో పువ్వు కార్యక్రమాల్లో తమ నిరసన తెలిపారు.

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడలో అంగన్‌వాడీల సమ్మెకు మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పలు మహిళా సంఘాలు మద్దతు తెలియజేశాయి. మహిళా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు డి రమాదేవి (ఐద్వా), గంగాభవాని, సుంకర పద్మశ్రీ, దుర్గాభవానీ, నాగమణి, శ్రీదేవి తదితర ఆయా సంఘాల నేతలు లెనిన్ సెంటర్‌లో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అనంతరం లెనిన్ సెంటర్ నుంచి ర్యాలీగా సమ్మె శిబిరం వద్దకు చేరుకున్నారు. చెవిలో పూలు పెట్టుకొని అంగన్‌వాడీలు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. వేతనం 26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ మంజూరు చేయాలని, పని భారం తగ్గించాలని అంగన్‌వాడీలు చేసిన నినాదాలు హోరెత్తాయి. సమ్మెనుద్దేశించి డి.రమాదేవి మాట్లాడుతూ యూనియన్ నేతలను ప్రభుత్వం చర్చలకు పిలిచి సత్వరమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా, సచివాలయ ఉద్యోగులతో అధికారులు అంగన్‌వాడీ సెంటర్ల తాళాలను పగలకొట్టించడం ద్వారా సమ్మెను విచ్ఛిన్నం చేయాలని, అంగన్‌వాడీలను బెదిరించాలని ఈ ప్రభుత్వం చూస్తుందన్నారు. సమస్యలు పరిష్కారం కాకుండా అంగన్‌వాడీ సెంటర్లను ఎలా తెరుస్తారని ప్రశ్నించారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే మహిళల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ, అధ్యక్షులు టి గజలక్ష్మీ, కోశాధికారి జయనీ రత్నకుమారి, యల్లారాణి, ఉమాదేవి, రమా తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: అంగన్వాడీలు, హెల్పర్లు మైలవరం పురవీధుల్లో భిక్షాటన, ఆల్ఫా హోటల్ సమీపంలో మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి, పుష్పకుమారి, సిహెచ్ శారద పాల్గొన్నారు. **నందిగామ:** నందిగామలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పివి ఆంజనేయులు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కట్టారపు గోపాల్, కరి వెంకటేశ్వరరావు, వేల్పుల ఏసోబు, కొల్లి సరళ, సుజాత, లక్ష్మి, వెంకట్రావమ్మ మహాలక్ష్మి పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద బలుసుపాడు రోడ్డు వరకు భిక్షాటన నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు, నాయకులు కె లింగారావు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి దంతాల వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోటా కృష్ణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాము, చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు అంజమ్మ, మదుకుమారి, సువర్చల, విశాలాక్షి, రత్నకుమారి పాల్గొన్నారు. **తిరువూరు:** తిరువూరు మధిర రోడ్డు సెంటర్‌లో అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం పట్టణంలో భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో పి.పద్మావతి, ఎన్ నాగమణి, చిట్టెమ్మ, ఉష, కె.లక్ష్మి, సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వరరావు, పంతంగి శ్రీనివాసరావు, ఆకుల రవి పాల్గొన్నారు. **అజిత్ సింగ్ నగర్:** అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా 57, 58 డివిజన్లో గ్రూప్ మీటింగులు నిర్వహించారు. ఈ సందర్భంగా ల్లో సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి ఎం.బాబురావు, అంగన్వాడీ టీచర్ రమాదేవి, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


విజయవాడలో...

నందిగామలో...

జగ్గయ్యపేటలో...

తిరువూరులో...

మైలవరంలో...

యుజిడిని వినియోగంలోకి తేవాలి : సిపిఎం

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ మ్యాన్ హోల్స్ పొంగుతూ

మురుగునీరు బయటకు వచ్చి పాదచారులు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుంది. ఈ విషయమై ప్రజల ఫిర్యాదు మేరకు బోయి సత్యబాబు నగరపాలక సంస్థ అధికారులకు తెలియజేయగా ఇంజనీరింగ్ సిబ్బంది పొంగుతున్న మ్యాన్‌హోల్స్ క్లీన్ చేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ 15 సంవత్సరాల క్రితం యుజిడి పైప్‌లైన్లు వేసి వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేయడం వల్ల యుజిడి వ్యవస్థ ధ్వంసం అవుతుందన్నారు. దీనివల్ల ప్రజల యొక్క మురుగునీరు పారుదల సక్రమంగా పోయే మార్గం లేక అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుందని తెలిపారు. ఈ విషయమై కౌన్సిల్లో పలుమార్లు పాలకుల దష్టికి తీసుకువెళ్లినా నేటికీ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల నిర్మాణాలకి ముందుగా అండర్‌గ్రౌండ్ లైన్ మరమ్మతులు పూర్తిచేసి సక్రమంగా పారుదల అయ్యే విధంగా వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీ సాయి సిల్వర్ ధమ్ బిర్యానీ పాయింట్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నగరవాసులకు పసందైన బిర్యానీ

రుచులను అందించేందుకు జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో శ్రీ సాయి సిల్వర్ ధమ్ బిర్యానీ పాయింట్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు అధినేత నాలి వెంకటకృష్ణ తెలిపారు. బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన బిర్యానీ పాయింట్‌ను శ్రీ సాయిబాబా స్వీట్స్ అధినేత చింతలచెరువు వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. అనంతరం వెంకటకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ చికెన్ ధమ్ బిర్యానీ, చికెన్ ఫ్రై బిర్యానీ, మటన్ దమ్ బిర్యానీ, మటన్ ఫ్రై బిర్యానీతో పాటు నగరంలోనే తొలిసారిగా చికెన్ లాలిపప్ తమ ప్రత్యేకతని తెలిపారు. హోమ్ డెలివరీ అందుబాటులో ఉందన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను పలువురు ప్రముఖులు బుధవారం దర్శించుకున్నారు. ప్రముఖ భారత బ్యాడ్మింటన్

క్రీడాకారిణి పి.వి.సింధు, రాష్ట్ర కార్మిక, పరిశ్రమలు శాఖ కార్యదర్శి డా. ఎం.హరి జవహర్ కుటుంబ సభ్యులు, ఫ్రాన్స్‌కు చెందిన విదేశీ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామరావు స్వాగతం పలికి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

ఇంద్రకీలాద్రిపై ఈ నెల 21వ తేదీ సాయంత్రం 6.30 గంటల నుండి 'దేవీ తత్త్వం - విశిష్టత ' అనే అంశంపై పంచ సహస్రావధాని, ప్రముఖ ప్రవచన కర్త, రచయిత, పరిశోధకులు డాక్టర్ మేడసాని మోహన్ ఆధ్యాత్మిక ప్రవచనం ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్తలమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతన రాజగోపురం ఎదురు ధర్మపథ కళావేదికపై ప్రవచనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రజాశక్తి-భవానీపురం: భవానీపురం పరిధిలోని 11 కెవి ఫీడర్‌లోని భవానీపురంలోని దర్గా ప్లాట్స్‌లో నూతన విద్యుత్ లైన్ల నిర్మాణంలో భాగంగా ఈ నెల 21వ తేదీ గురువారం ఉదయం 8 నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విజయవాడ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వి.సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఇసుజు శీతాకాల సర్వీస్ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఇసుజు మోటార్స్ ఇండియా వార్షిక శీతాకాల ఐ కేర్ సర్వీసు శిబిరాన్ని ప్రారంభించినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ కె.ఎం.కె. రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 వరకు నిర్వహించే శిబిరంలో సుజుకి వాహనాలకు సంబంధించి డి మాక్స్, పికప్, ఎస్యూవీల శ్రేణిలో కస్టమర్లు ఆకర్షణీయమైన ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు.

చిన్న కథల పోటీల్లో రాజశేఖర్‌కు బహుమతి

ప్రజాశక్తి-వన్‌టౌన్: జాతీయ స్థాయి చిన్న కథల పోటీల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన రచయిత పాణిగ్రాహి రాజశేఖర్‌కు బహుమతి లభించింది. ముట్నూరి కమలమ్మ ఫౌండేషన్, సాహితీ కిరణం సాహిత్య మాసపత్రిక సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి చిన్న కథల పోటీల ఫలితాలను సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు వెల్లడించారు. పోటీల్లో విజేతలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున పొత్తూరు సాహితీకిరణం బ్రాంచి కార్యాలయంలో 2024 ఏప్రిల్‌లో జరిగే ఉగాది వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యార్థులకు విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ఇతర అంశాలను నేర్పాల్సిన అవసరం నేడు ఎంతయినా ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఎన్‌ఐటీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ ఫార్చ్యూన్ మురళీ నందు విద్యావేత్తల సదస్సు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో విద్యావేత్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు. తొలుత విశ్వవిద్యాలయం ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ప్రకాష్ గోపాలన్ విశ్వవిద్యాలయ ప్రాముఖ్యత, అలాగే విద్యా సంస్థలో అందిస్తున్న విద్యా విధానం, కోర్సులు వివరాలను తెలియచేశారు. అలాగే నేటి విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు చక్కని బోధన అంధించాలని అన్నారు. ఎప్పటికప్పుడు కొత్త కోర్సులను నేర్పించడం వల్ల విద్యార్థులలో వికాసం, విజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరు మృతి

ప్రజాశక్తి-వత్సవాయి: బైక్ అదుపుతప్పి ఒకరు మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన వత్సవాయిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు లింగాల గ్రామానికి చెందిన ఆంబోజి భూషణరాజు స్నేహితులతో కలిసి వత్సవాయి నుంచి లింగాల వస్తుండగా కోల్డ్ స్టోరేజ్ సమీపంలో బైక్ అదుపు తప్పి పడిపోయాడు. అతనిని విజయవాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాజుకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. వత్సవాయి ఎస్సై అభిమన్యు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలో పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ కమిటీ నిర్వహణలో భాగంగా 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేశ్ మరియు విజిలెన్స్ కమిటీ సభ్యులు బుధవారం రేషన్ షాపులు సందర్శించి స్థానిక పౌరసరఫరాల రేషన్ షాప్ నెంబర్ 0684055 జరిగిన విజిలెన్స్ కమిటీ సమావేశానికి హాజరై రేషన్ సరుకుల నాణ్యతను మరియు సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సంతప్తి సమాధానాలు విన్న తర్వాత కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ రేషన్ డీలర్లకు మరియు ఎండివి ఆపరేటర్లకు సూచనలు చేస్తూ కార్డుదారులకు సక్రమంగా చేయవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో చిట్టినగర్ యుడిసిఐ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ కె. శివకష్ణ. వీఆర్వో రాంబాబు, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ డి.వి. ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

క్వాలిటీ కౌన్సిల్ అఫ్ ఇండియాతో ప్రభుత్వం భాగస్వామ్యం

ఒప్పంద పత్రాలను చూపుతున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వ్యవసాయ అనుబంధ రంగాలలో సహకారం కోసం రాష్ట్ర ప్రభుత్వం క్వాలిటీ కౌన్సిల్ అఫ్ ఇండియాతో భాగస్వామ్యమైనదని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. విజయవాడ నోవాటెల్ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ 'గున్వత్తా సంకల్ప్' కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్వాలిటీ కౌన్సిల్ అఫ్ ఇండియాలో చేతులు కలపడం ఎంతో సంతోషంగా ఉందని, దీనిద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలలో నాణ్యమైన ఉత్పత్తులు సాధించడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. క్వాలిటీ కౌన్సిల్ అఫ్ ఇండియా నిర్వహిస్తున్న ఈ వర్క్ షాప్ రైతులకు వ్యవసాయ అధికారులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. క్యూసీఐ చైర్ పర్సన్ జాక్సే షా మాట్లాడుతూ యువతను శక్తివంతం చేయడానికి గౌరవ్ కాల్ లో విక్షిత్ భారత్ కోసం సమగ్ర నాణ్యమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడంలో దోహదపడే అవకాశాన్ని అందించడానికి క్యూసీఐ రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో చురుకుగా సహకరిస్తుందని చెప్పారు. ముందుగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదిక్వాలిటీ కౌన్సిల్ అఫ్ ఇండియాతో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలను జాక్సేషాకు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సహకార శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, క్వాలిటీ కౌన్సిల్ అఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ రాజేష్ మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
గురువారం 21 డిసెంబర్ 2023

అంగన్వాడీల సమ్మె ఉధృతం

- భిక్షాటన, వంటావార్పులతో వినూత్న నిరసన

గన్నవరంలో...

గుడ్లవల్లేరులో..

కంకిపాడులో..

పెనమలూరులో..

మొవ్వలో...

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరంలో అంగన్వాడీలు బుధవారం గాంధీ బొమ్మ సెంటర్లో బిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేస్తున్న కారణంగా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రచారం చేశారు. అంగన్వాడి సంఘం నాయకులు రమాదేవి, సాంబ, కనకదుర్గ, సిఐటియు నాయకులు కే.వెంకటేశ్వరరావు, తాతబ్బాయి, మహేష్, బేతా శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చనిపల్లివారిగూడెంలో తల్లుల నిరసన : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని గన్నవరం మండలం చనుపల్లి వారి గూడెంలో అంగన్వాడి సెంటర్లో పిల్లల తల్లులు పిల్లలతో బుధవారం నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి, సిఐటియు గన్నవరం మండల నాయకులు బెజవాడ .తాతబ్బాయి, అంగన్వాడి వర్కర్స్ విజయ కుమారి, రోజా ,నదియా పాల్గొన్నారు. **ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** ఉత్తుతి జిఓలతో అంగన్వాడిల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రమా దేవి తెలిపారు. అంగన్ వాడి కార్యకర్తలకు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలక్టరేట్ వద్ద చేస్తున్న సమ్మె ,9 వ రోజుకు చేరుకుంది. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసిస్తూ బుధవారం ధర్నా చౌక్ వద్ద వంట వార్పు చేసి తమ నిరసనను తెలియజేశారు. సిఐటియు జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం సంఘీభావం తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి గోపాలరావు, జిల్లా నాయకులు వివి రమణ, అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మచిలీపట్నం ప్రాజెక్ట్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి నాంచారమ్మ,రెజీనా రాణి, లక్ష్మి, అంజలి, విజయశ్రీ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడు వీధుల వెంట అంగన్‌వాడీలు భిక్షాటన చేసి నిరసన తెలియజేశారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఉప్పాడ త్రిమూర్తులు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు తాడింకి నరేష్, ఉయ్యూరు సిఐటియు మండల కార్యదర్శి బాలగంగాధర్ ప్రాజెక్ట్ అధ్యక్షులు నళిని కుమారి, రేవతి సెక్టార్ లీడర్స్ లక్ష్మీప్రసన్న, విజయలక్ష్మి కాలిమ్మ హలీమా కనకరత్నం రమాదేవి తదితరులు పాల్గొన్నారు. **పెనమలూరు :** యనమలకుదురు ఒకటో వార్డులో, తాడిగడప కార్మిక నగర్ 1లో, తాడిగడప కార్మిక నగర్ 2లో. అంగన్వాడి కేంద్రాల వద్ద సిఐటియు, ఐద్వా. మహిళా సంఘం ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రులతో కలసి ఆందోళన నిర్వహించారు. సిఐటియు పెనమ లూరు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, పెనమలూరు మండలం ఐద్వా మహిళా సంఘం కార్యదర్శి పుసులూరు పాత లక్ష్మి, సిఐటి యు నాయకులు ఎస్.కె కాసిం, మహిళా సంఘం నాయకు రాలు సిహెచ్ భవాని, దిసరి రవణమ్మ విసం రవణమ్మ, సిఐటియు నాయకులు పుసులూరి సత్యనారాయణ, సిహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.**ప్రజాశక్తి-ఉయ్యూరు:** సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం అంగన్వాడీ కేంద్రాల వద్ద నిరసన చేపట్టారు. పార్టీ నా యకుడు బి రాజేశ్, బాబూఖాన్, ఎలయ్య, చింతయ్య తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :**అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి మద్దతుతెలిపారు. గుడివాడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ప్రాజెక్టు ఏరియాలోని అంగన్వాడీ కార్యకర్తలంతా సమ్మెలో పాల్గొన్నారు. సిపిఎం నాయకులు శీలం నారాయణరావు, ఆవుల బసవయ్య, బండి ఆదిశేషు, పోలా బత్తిన మోహన్‌రావు, కర్ర వెంకటేశ్వరరావు, గొరిపర్తి శ్రీనివాసరావులు పాల్గొని అంగన్వాడీ కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు నిర్మల జ్యోతి గాదే సుశీల కె పాములమ్మ ఏ నాగమణి కే విజయ రాణి ఎం సుధారాణి రాణి తదితరుల తో పాటు పెద్ద సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - మొవ్వ** మొవ్వ సిడిపిఓ కార్యాలయం వద్ద వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. అంగన్వా డీల ఆందోళనకు సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, శీలం నారాయణ రావు, సీఐటీయూ నేతలు కరీముల్లా, కాకి రాజశేఖర్ తదితరులు మద్దతు తెలిపారు. .యూనియన్ ప్రతిని ధులు విజయలక్ష్మీ, రాజారత్నం, గంగాభవాని తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** కౌలు రైతు సంఘం అంగన్వాడీ పేరెంట్స్ కమిటీ, సిపిఎంల ఆధ్వర్యంలో వడ్లమన్నాడు1 సెంటర్ అంగన్వాడీ కేంద్రాం ఎదురుగా ధర్నా బుధవారం నిర్వహించి నిరసన తెలిపారు. కౌలు రైతు సంఘం గ్రామ కార్యదర్శి మాదాసు సుబ్బయ్య(తాతబ్బాయి), సి.పి.ఎమ్ నాయకులు బి.వి.శ్రీనివాసరావు,కౌలు రైతులు కూనపు రెడ్డి వీరబాబు, బొప్పన నాని,పేరెంట్స్ కూనపు రెడ్డి వీరబాబు, పుల్లేటి నాగరాజు, దాత్తడ శివరామరాజు, అప్పునీడి నాగరాజు, తోట బాలాజీ,కోన బాబూరావు, నున్నా శంకరరావు, రాచమళ్ల వెంకటేశ్వరరావు,రచమళ్ల అంకమల్లేశ్వరరావు, వీరంజనేయులు పాల్గొన్నారు.

దేవాలయ భూమి స్వాధీనం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : తోట్లవల్లూరు శ్రీ బ్రహ్మాంబ చెన్న మల్లికార్జున స్వామివారి దేవాలయానికి చెందిన భూమిని ఆక్రమణదారుల నుండి స్వాధీనం చేసుకున్నట్లు దేవాలయ కార్య నిర్వహణ అధికారి సిహెచ్ హరి దుర్గా నాగేశ్వరరావు బుధవారం పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ కాకినాడ వారి ఉత్తర్వులు మేరకు దేవాలయానికి చెందిన భూమి గుడ్లవల్లేరు మండలం పెసరమిల్లి గ్రామంలో 2 ఎకరాల 6 సెంట్లు భూమి ఉందని, దీనిని అల్లూరి నాగేశ్వరరావు ఆక్రమించాడని దేవాదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఈ ఆక్రమించిన భూమిని దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

నిష్పక్షపాతంగా కులగణన నిర్వహించాలి

ప్రజాశక్తి ఘంటసాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కులగణనను నిష్పక్షపాతంగా నిర్వహించాలని బీసీ, ఎస్సీ, మైనార్టీ సంఘాల నేతలు అధికారుల ఎదుట స్పష్టం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.రామానాయక్, ఎంపిడివో టి. అనూహ్యాలు మాట్లాడుతూ ప్రభుత్వం కులగణన చేయటానికి ఆయా సామాజిక వర్గాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, అభిప్రాయాలను తెలుసుకోవాలని కోరిందని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్ మాట్లాడుతూ ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ చేసుకున్న వారికి ఎస్సీ సర్టిఫికేట్ ఎలా జారీ చేస్తారో తెలపాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గన్నవరం : ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లింపు చేయాలని,ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించవలసిన పిఎఫ్, పిఆర్ సి-డిఏ అరియర్లు, సరెండర్ లీవులు తదితర ఆర్థిక బకాయిల విడుదలకై ప్రభుత్వంతో చర్చించాలని కోరుతూ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కార్యాలయంలో బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27 నుండి ఆందోళన చేపడుతున్నట్లు యుటిఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రతినెలా 1వ తేదీన జీతములు చెల్లించే విధముగా నిబంధనలు ఉన్నవనీ, కాని, గత 2 సంవత్సరాలుగా ఈ నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల కాలంలో 15వ తేదీ వరకు కూడా చాలామందికి జీతములు చెల్లించుట లేదనీ దీనివలన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను సీఎం దష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే వంశీకి విన్నవించినట్లు చెప్పారు. జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్, జిల్లా కార్యదర్శి వి.రవిబాబు, రాష్ట్ర కౌన్సిలర్ పి.ప్రసాదరావు, జి.రాజబాబు., జి.వి.రవిబాబు, డి.నవభారతి, తాతా శ్రీను, బి.జ్ఞానానందం, డి.శ్రీనివాసనాయక్, డి.కుమార్. టి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంలపై అవగాహన

ప్రజాశక్తి హనుమాన్ జంక్షన్: ఎన్నికల సమర్ధవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికలసంఘం ప్రవేశపెట్టిన ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కలిగిఉండాలని ఆర్ఐ రాజేష్ సూచించారు. వీరవల్లి, శోభనాద్రిపురం పరిధి లోగల పోలింగ్ కేంద్రాల్లో అర(రెవిన్యూ ఇన్స్పెక్టర్) రాజేష్ పర్యవేక్షణలో రాజకీయపార్టీ ప్రతినిధులతో బుధవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఓటరు వెరిఫైబుల్, పుపర్ ఆడిట్ ట్రయల్(వీవీపాట్) ద్వారా ఎవరికి ఓటు 'వేసారో కనిసిస్తుందని, ప్రతి ఓటు కంట్రోల్ యూనిట్లో నమోదవుతందని, శబ్దం వచ్చిన తర్వాత మాత్రమే తదుపరి ఓటు వేయడానికి వీలవుతుందని వివరించారు. వీఆఒ శేఖర్, కార్యదర్శి శ్యామలరావు, పిల్లా రామారావు, ఆత్కూరి బాలాజీ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-మోపిదేవి : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం కొత్త ఆలోచనలు చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పేర్కొన్నారు. మోపిదేవి మండల పరిధిలోని పెదప్రోలు గ్రామ సచివాలయం వద్ద బుధవారం కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో రమేష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త ఎస్.బి సతీష్, పెదకళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హారిక, పంచాయతీ కార్యదర్శి కొల్లిపర రామ కోటేశ్వరరావు పిఎసిఎస్ చైర్ పర్సన్ ఆది రాంబాబు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి), తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో పంట నష్టం వివరాల ప్రదర్శన

ప్రజాశక్తి-ఘంటసాల : ఇటీవల వచ్చిన మిచాంగ్ తుఫాను వల్ల నష్టపోయిన రైతుల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లోని నోటీసు బోర్డులో ప్రదర్శించామని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకష్ణ తెలిపారు. ఘంటసాల మండలంలోని దేవరకోట, ఘంటసాలపాలెం, తదితర గ్రామాలలోని ఆర్బికేల్లో మిచాంగ్ తుఫాను వల్ల నష్టపోయిన రైతుల వివరాలను బుధవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏవో మురళీ కష్ణ మాట్లాడుతూ మిచాంగ్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు, ఈదురు గాలులకు 33 శాతం కంటే పైన నష్టపోయిన వరి పంట వివరాలను వ్యవసాయ శాఖ, రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో నమోదు చేశామన్నారు. నమోదు చేసిన వివరాలను మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల్లోని నోటీసు బోర్డులో ముసాయిదా జాబితాను ప్రదర్శించామన్నారు. ఆయా జాబితాల పై రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 22వ తేదీ లోపు తగిన ఆధారాలతో ఆర్బీకే లోని వ్యవసాయ సహాయకులకు అందిస్తే మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. దేవరకోట సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, వేమూరి రాజేంద్రప్రసాద్, మూల్పూరి వెంకయ్య పాల్గొన్నారు.

10న వాకౌట్ సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఎల్ఐసి ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికై జనవరి 10 వ తేదీన జరిగే ఒక గంట వాకౌట్ సమ్మెలో ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పిలుపు నిచ్చారు.ఆగస్టు 1, 2022 నుండి జరగవలసిన వేతన సవరణ కోసం తక్షణమే చర్చలు ప్రారంభించాలని, నూతన పెన్షన్ స్కీం క్రింద కవర్ అవుతున్న ఉద్యోగులకు యాజమాన్యం చెల్లించే కాంట్రిబ్యూషన్ ను 10 నుండి 14 శాతానికి పెంచాలని, అన్ని కేడర్లలో తగిన నియామకాలు చేపట్టాలని ఉద్యోగులు మరియు అధికారుల సమస్యలపై యాజమాన్యం యొక్క ఏకపక్ష వైఖరిని విడనాడాలని తదితర డిమాండ్‌లతో వాకౌట్ సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మెను జయప్రదం చేయడంలో భాగంగా వివిధ ఉద్యోగ సంఘాలతో కూడిన జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎల్ ఐ సి డివిజనల్ కార్యాలయం వద్ద బోజన విరామ సమయంలో గేట్ మీటింగ్ మరియు డిమాన్ స్ట్రేషన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు జె. సుధాకర్, జి. కిషోర్ కుమార్, టి. చంద్రపాల్, ఎల్. రాజశేఖర్, వి.ఆర్. ఎన్. ఠాగూర్, కె.వి. దుర్గా ప్రసాద్, వి. శ్రీనివాస్, ఎస్. దిలీప్ పాల్గొన్నారు.

ఉంగుటూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-ఉంగుటూరు : గత ఏడాదితోపోలిస్తే ఈ ఏడాది క్రైమ్ రేటు తగ్గిందని డిఎస్పి జైసూర్య అన్నారు. బుధవారం గన్నవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి కనకారావుతో ఉంగుటూరు పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో క్రైంరేటు తగ్గించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నామ న్నారు. అనంతరం సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఎస్సై రాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ముగిసిన ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ సబ్ డివిజన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు విజయ వంతంగా ముగిశాయి. వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని విద్యుత్ శాఖ ఉద్యోగులు బుధవారం బైపాస్ రోడ్డు వద్ద గల సబ్ డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ప్రారంభమై ర్యాలీ ఏలూరు రోడ్డు, నెహ్రూ చౌక్, మార్కెట్ సెంటర్, బస్టాండ్ సెంటర్ల మీదుగా సాగింది. ఇంధన పొదుపు చేద్దాం, భావి తరాలకు వెలుగునిద్దాం అంటూ దారి పొడవున ఉద్యోగులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ డిఇ రామకృష్ణ మాట్లాడుతూ ఎల్ఇడి బల్బుల వినియోగం, విద్యుత్ ఆదా చేసేలా ఎలక్ట్రికల్ పరికరాల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి విద్యుత్ శక్తిని పొదుపు చేస్తూ భావితరాలకు వెలుగు నివ్వడంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ ర్యాలీలో డివిజన్ పరిధిలోని ఎడిఇలు, విద్యుత్ శాఖాధికారులు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
గురువారం
21 డిసెంబర్ 2023

భళా...బాలల కళ..!

- అబ్బురపరిచిన సైన్స్ ప్రదర్శనలు
- ఆలోచింపజేసిన నమూనాలు
- ఆకట్టుకున్న నృత్య రూపకాలు, నాటికలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

అమరావతి బాలోత్సవ్ ఆధ్వర్యంలో విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో జరుగుతున్న ఆరో పిల్లల పండుగ రెండో రోజు బుధవారం వివిధ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. విద్యార్థుల్లో సృజనాత్మకత వెల్లివిరిసే విధంగా పలు పోటీలను నిర్వహించారు. బాలల సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు నమూనాలు ఆలోచింపజేశారు. పోటీలకు నగరంలోని వివిధ ప్రాంతాల నుండి సుమారు 150 పాఠశాలల నుండి మూడు వేల మందికిపైగా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీటితో పాటు శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, వ్యాసరచన, సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలోత్సవం అధ్యక్షులు ఎస్.పి.రామరాజు మాట్లాడుతూ రెండో రోజు పోటీల్లోనూ విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారన్నారు. ఏ రోజుకారోజు విజేతలను ప్రకటించి సర్టిఫికెట్లు, షీల్డులు అందజేస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో సుమారు 11 వేల మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. పోటీల ముగింపు కార్యక్రమం గురువారం సాయంత్రం జరుగుతుందని తెలిపారు.

చిత్రలేఖనం

ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: అమరావతి బాలోత్సవ్ పిల్లల పండుగలో భాగంగా బుధవారం రెండో రోజు పోటీలలో విచిత్ర వేషధారణ అంశంపై జూనియర్స్ విభాగంలో పోటీలను నిర్వహించారు. ఇందులో విద్యార్థులు వివిధ రకాలైన వేషధారణలతో పాటు ప్రజలకు అర్థవంతమయ్యే విధంగా సూచనలు అందించారు. ముఖ్యంగా 'యూనివర్స్' పేరుతో 5వ తరగతి విద్యార్థి పి.పవన్ వేసిన వేషధారణ సందర్శకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు మంచి మెసేజ్ అందించే విధంగా రూపొందించారు. చెట్లను పెంచడం వల్ల సమాజం పచ్చగా ఉండి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని అలా కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత లేకుండా ప్లాస్టిక్‌ను వాడటం వల్ల పలు విధాలుగా అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుందని ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలని కోరుతూ చక్కటి సందేశం అందించారు.

వేద ఇంగ్లీషు మీడియం స్కూల్ 5వ తరగతి విద్యార్థిని సౌమ్య సహస్ర ఇస్రోలో రాకెట్ ప్రయోగాన్ని ఏవిధంగా చేస్తారో రాకెట్ నమూనాను విద్యార్థి స్వయంగా ధరించి బాలోత్సవ్ ప్రాంగణమంతా తిరుగుతూ రాకెట్ ప్రయోగం పట్ల అవగాహన కల్పించింది. రాకెట్ వస్తుంది... అంటూ విద్యార్థులు సందడి చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అమరావతి బాలోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రధాన వేదిక పద్మవిభూషన్ ఎం.ఎస్.స్వామినాథన్ వేదికపై కోలాటం నిర్వహించారు. విచిత్ర వేషధారణలో జూనియర్స్ విభాగంలో జరిగింది. ఈ పోటీకి సంబంధించి సుమారు 50 మందికిపైగా విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. శాస్త్రీయ నృత్యం, దేశభక్తి గీతాలాపన పోటీలు సీనియర్స్ విభాగంలో జరిగాయి. అనంతరం చిత్రలేఖనం పోటీలు సబ్ జూనియర్స్ విభాగంలో 'సూర్యోదయం', జూనియర్స్‌కు 'ఆగస్టు 15', సీనియర్స్‌కు 'ఆనకట్టలు వ్యవసాయం' అనే అంశాలపై పోటీలను నిర్వహించగా సుమారు 200 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన అంశంకు సంబంధించి జూనియర్స్‌కు పర్యావరణం అనే అంశంపైన, సీనియర్స్‌కు ప్రాథమిక విద్యలో ఇంగ్లీషు మీడియం సవాళ్లు అనే అంశంపైన తెలుగు విభాగంలో పోటీలు జరిగాయి. అలాగే వ్యాసరచన ఇంగ్లీషు మీడియంకు సంబంధించి జూనియర్స్‌కు మాతృభాష, సీనియర్స్‌కు భారత రాజ్యాంగ పీఠిక విశిష్టత అనే అంశంపై పోటీలను నిర్వహించారు. సబ్ జూనియర్స్ విభాగంలో కథ చెప్పడం అనే అంశంపై పోటీలను నిర్వహించారు. అమ్మమ్మ, తాతయ్యల వద్ద నుండి ఎన్నో కథలు నేర్చుకున్న చిన్నారులు బుడిబుడి పదాలతో చెప్పిన కథలు విశేషంగా అలరించాయి.

పాటల పోటీలు

నేటి పోటీల వివరాలు

గురువారం ఉదయం 10 గంటలకు సీనియర్స్ విభాగంలో జానపద నృత్యాలు, సబ్ జూనియర్స్‌కు ఫ్యాన్సీ డ్రస్ పోటీలు, సబ్ జూనియర్స్‌కు రైమ్స్ పోటీలు ఉండాయి. అలాగే జానపద గీతాలాపన మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతుంది. ఇండోర్ స్టేడియంలో మెమరీ టెస్టు జూనియర్స్ విభాగంలో జరుగుతుంది. మట్టితో బొమ్మలు, సబ్ జూనియర్స్, సీనియర్స్, జూనియర్స్ విభాగంలో జరుగుతుంది. డిబేట్ సీనియర్స్‌కు జరుగుతుంది. వీటితో పాటు క్విజ్ జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతాయి. మధ్యాహ్నం మూడు గంటలకు ముగింపు కార్యక్రమంలో భాగంగా విజేతలకు బహుమతులు అందజేస్తారు.

విజేతలు వీరే...

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో జరుగుతున్న బాలోత్సవ్ సాంస్కృతిక పోటీలలో విజేతల వివరాలను నిర్వాహకులు తెలియచేశారు. **కథారచనలో** వేమిరెడ్డి శరణ్య (కాకతీయ ఇంగ్లీషు మీడియం స్కూల్), టి.మహేశ్వరి (డాక్టర్ జెడిఎంఎం స్కూలు - వంబేకాలనీ), జోహ్రా తబస్సుమ్ (దర్గా ఇస్లామీ స్కూల్ లబ్బీపేట) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. **కార్టూన్** జూనియర్స్ విభాగంలో పి.త్రిపార్థవ, కె.మాధవ్ (నవోదయ ఇంగ్లీషు మీడియం స్కూల్) బి.అక్షయ (జిడిఇటిఎం స్కూల్ పటమట) మొదటి మూడు స్థానాలు సాధించారు. సీనియర్స్ విభాగంలో ఎన్.వెంకట్ (కుమార్ ఇంగ్లీషు మీడియం స్కూల్ నూజివీడు), ఎస్.షణ్ముఖ (సెయింట్ జాన్స్ స్కూలు, గుణదల), బి.ఆర్ కిరణ్మయి (పివికెఆర్ఎం కుమార్ స్కూలు నూజివీడు) వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. **కవితా రచనలో** షేక్ రజియా బేగం (స్రవంతి హైస్కూల్ గన్నవరం), కెబివి సాయిలక్ష్మీ (గౌతమ ఇంగ్లీషు మీడియం స్కూల్ మధురానగర్), సి. హెచ్. కాత్విక హరిణి (పివికెఆర్ఎం కుమార్ స్కూల్ నూజివీడు) విజయం సాధించారు. వార్తా రచనలో ఎం.ప్రవీణ (స్రవంతి హైస్కూల్ -గన్నవరం), రాపర్ల యస్నిక (కుమార్ ఇంగ్లీషు మీడియం స్కూల్ -నూజివీడు), షేక్ ఆసిఫా (శ్రీవిద్యాస్కూల్ నందిగామ), **వక్తృత్వంలో** జూనియర్స్ విభాగంలో ఎం.హన్విత్ రెడ్డి (పివికెఆర్ఎం స్కూల్ నూజివీడు), జి.తీర్థ (కుమార్ ఇంగ్లీషు మీడియం స్కూల్ నూజివీడు), కె.దీపిక (సెయింట్ థెరిస్సా స్కూల్ కానూరు), సీనియర్స్ విభాగంలో ఎం.వరుణ్ కార్తీక్ (అమలి ఇంగ్లీషు మీడియం స్కూల్), కె.భవ్యశ్రీ (త్రివిధ ఇంగ్లీషు మీడియం స్కూల్ -నూజివీడు), ఎం.సాహితి (ఎస్‌బివిఎస్ఆర్ హైస్కూల్), **బెస్ట్ ఫ్రం వేస్ట్ ...** సీనియర్స్ విభాగంలో శివ మణికంఠ (శ్రీ విద్య స్కూలు నందిగామ), తేజ వెంకట పవన సాయి (శ్రీ భారతి స్కూలు మంగళగిరి), సిహెచ్. భాను జ్యోషిక (త్రివిధ ఇంగ్లీషు

మీడియం స్కూల్ నూజివీడు), జూనియర్స్ విభాగంలో వి.జోబిన్ (విఎంసి ఉర్దూ ఎలిమెంటరీ స్కల్ అరండల్‌పేట), ఎన్.శ్రీలాస్య (కాకతీయ ఇంగ్లీషు మీడియం స్కూల్ - రామలింగేశ్వరనగర్), వి.లేఖణ చంద్ర (సత్యసాయి విద్యానికేతన్ మంగళగిరి) విజయం సాధించారు. **దేశ భక్తి, అభ్యుదయ గీతాలు ...** మనస్విని అండ్ టీమ్ (శ్రీ విజ్ఞాన విహార ఇంగ్లీషు మీడియం స్కూల్), తాతినేని మేథ అండ్ టీమ్ (విపిఎస్ పబ్లిక్ స్కూల్), ఎస్‌కె. సమర్మార్య అండ్ టీమ్ (కుమార్ ఇంగ్లీషు మీడియం స్కూల్ నూజివీడు), **శాస్త్రీయ నృత్యం...** జూనియర్స్ విభాగంలో కె.మనస్విని (రవీంద్రబారతి స్కూల్), బట్టు వేదశ్రీ (విపిఎస్ పబ్లిక్ స్కూల్), మనోజ్ఞ (కుమార్ ఇంగ్లీషు మీడియం స్కూల్ నూజివీడు), **లఘునాటిక ...** పి.అమూల్య అండ్‌టీం (వివేకానంద స్కూల్ ప్రసాదంపాడు), అభి ఆరాధ్య అండ్‌టీం (శ్రీ విద్య హైస్కల్ నందిగామ), ఎస్‌కె అష్రఫ్ అండ్ టీం (శ్రీ విద్య విద్యాలయ స్కూలు నందిగామ), **ఏకపాత్రాభినయం...** సీనియర్స్ విభాగంలో జాహ్నవి (అభ్యాస విద్యాలయం), సాయి శ్రీనివాస్ (శ్రీ విద్య స్కూలు నందిగామ), జి.ఆకాష్ (స్రవంతి స్కూలు గన్నవరం), **జానపద నృత్యం...** దేవి కిరణ్ అండ్ టీమ్ (కుమార్ ఇంగ్లీషు మీడియం స్కూల్ నూజివీడు), సాత్విక్ సాయి అండ్ టీం (రేడియం హైస్కూల్ నున్న), షలోమ్ రాజ్ అండ్ టీం (స్రవంతి హైస్కూల్ గన్నవరం), **దినపత్రికా పఠనం...** ఎస్.వి.వి. సత్యనారాయణ (స్రవంతి హైస్కూల్ గన్నవరం), ఎస్.రోహన్ (రవీంధ్రభారతి స్కూల్), సిహెచ్.భాస్కర్ (కుమార్ ఇంగ్లీషు మీడియం స్కూల్ నూజివీడు) మొదటి మూడు స్థానాలు సాధించారు.

చిట్టి మెదళ్లకు పదును...

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: అమరావతి బాలోత్సవం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా రాణించనున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థులు వారిలోని నైపుణ్యాన్ని ప్రదర్శించి ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శనాంశాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల మెదడుకు పదును పెట్టి రానున్న తరంలో ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కోగలమో వారి ప్రాజెక్టుల ద్వారా తెలియజేసిన విధానం అందరినీ ఆలోచింపజేసింది.

మన పరిసర ప్రాంతాలు పొల్యూషన్ అవుతున్నాయని దీని కారణంగా మానవ మనుగడకు పెను ప్రమాదం రానుందని, పొల్యూషన్ కాకుండా పరిసర ప్రాంతాలను ఏవిధంగా రక్షించుకోవాలో చక్కగా వివిధ నమూనాలతో చేసిన విధానం ప్రత్యేకంగా ఆకట్టుకుటుంది. నగరంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 6వ తరగతి విద్యార్థి మోక్షిత్ చక్కగా తయారు చేసి ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. అంతేకాకుండా మన పరిసర ప్రాంతాలలో మొక్కలను నాటడంతో పటు, చుట్టు ప్రక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనాన్ని అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేశాడు.

ప్రకృతి ద్వారా సహజవనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు సోలర్ వ్యవస్థను ఏవిధంగా ఉపయోగించుకోవచ్చునే భవానీపురంలోని నేతాజీ స్కూల్ విద్యార్థులు తమ నమూనా ప్రదర్శనల ద్వారా చేసి చూపించారు. నేడు విద్యుత్ వాడకం ఎక్కువగా పెరుగుతుందని విద్యుత్‌ను ఆదా చేయడంతో పాటు సోలార్‌ను వినియోగించుకుని బయో ఫ్యూయల్ ఏవిధంగా చేయవచర్చనో పాఠశాల ఏడవ తరగతి విద్యార్థులు ఓంకారలక్ష్మీ, ప్రణతిలు తయారు చేసి చూపించారు.

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ప్రయోగించిన చంద్రయాన్ రాకెట్ నమూనాను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ఈ నారాయణ స్కూల్ విద్యార్థులు సయ్యద్ ముఫిద్, రాజేష్‌లు తొమ్మిదవ తరగతి చదువుతున్నారు. నమూనాలను ప్రదర్శఇంచంతో పాటు ఇస్రో ఆధ్వర్యంలో ఇప్పటి వరకు అంతరిక్షానికి పంపిన రాకెట్ల గురించి సందర్శకులు వివరించడంతో పాటు రానున్న కాలంలో ఏవిధంగా సంస్థ చేసే కార్యకలాపాలను కూడా చక్కగా చేసి చూపించారు.

మానవ శరీరంలో కిడ్నీలు ఎంతో ప్రధానమైనవని కిడ్నీ ద్వారా మానవ శరీరంలో ఏవిధంగా పనిచేస్తాయి... అవి పనిచేసే విదానం గురించి రవీంధ్రబారతి పబ్లిక్ స్కూల్ 6వ తరగతి విద్యార్థిని రమ్య చక్కగా చేసి చూపించారు. అంతేకాకుండా థర్మాకోల్ షీట్‌తో కిడ్నీ నమూనా తయారు చేసి ఏవిధంగా శరీరంలో పంపిణీ జరుగుతుందో వివరించాడు.

సైన్స్ ప్రదర్శన

నిర్వాహకుల పరిశీలన

నాటిక ప్రదర్శన

కోలాటం...

విచిత్ర వేషధారణ

వేతన సవరణ చర్చలు వెంటనే ప్రారంభించాలి

ఎల్ఐసి సంఘాల నేతల డిమాండ్

ఉద్యోగులు, అధికారుల భోజన విరామ ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గత పదిహేడు నెలలుగా బాకాయి పడిన వేతన సవరణపై వెంటనే చర్చలు ప్రారంభించాలని ఎల్ఐసి ఉద్యోగులు, అధికారులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై జనవరి 10వ తేదీన ఒక గంట వాకౌట్ సమ్మె నిర్వహిస్తామని ప్రకటించారు. విజయవాడ భవానీపురం ఎల్ఐసి కార్యాలయం వద్ద బుధవారం భోజన విరామ సమయంలో ప్రదర్శన నిర్వహించారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా నిర్వహించిన ఈ ప్రదర్శనలో ఉద్యోగులు, అధికారులు, పెన్షన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థ అభివృద్ధిలో సిబ్బంది గణనీయమైన పాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. సంస్థ ఆస్తులు నాలుగు లక్షల కోట్ల రూపాయలపైన పెరిగాయన్నారు. సెకనుకు నాలుగు క్లయిమ్‌లు పరిష్కరిస్తూ ఎల్ఐసి పట్టాదారుల సేవలో ముందున్నారన్నారు. బీమా ప్రీమియంపై జిఎస్‌టి తీసివేయాలని కోరారు. పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఎల్ఐసి క్లాస్ వన్ ఆఫీసర్స్ ఫెడరేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫీల్డ్ వర్కర్స్ ఇన్ ఇన్సూరెన్స్ ఫెడరేషన్ సంయుక్తంగా యాజమాన్యానికి విజ్ఞప్తి చేసినా కనీసం చర్చలకు పిలవలేదని తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించేత వరకూ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎస్ఎంకె.ప్రసాద్, ఎంఎస్.పాత్రుడు, ఎం.వి.సుధాకర్, ఎస్ఎ.సలీమ్, సిహెచ్.రాజశేఖర్, ఎస్.మల్లికార్జున్ పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : 57వ డివిజన్లోని అపార్ట్మెంట్ బ్లాక్ నెంబర్ 1, 2 ,3, 4, 5, 6 వద్ద పొంగి పొర్లుతున్న మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. దీంతో రోడ్లపై నీరు నిల్వ ఉంటోంది. ఈ సమస్యపై మూడు నెలలుగా ఇబ్బంది పడుతున్నా విజయవాడ నగర పాలక సంస్థ అధికారులు ఇప్పటి వరకు పరిష్కరించలేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలు సిపిఎం ఆధ్వర్యాన బుధవారం రోడ్డుపై నిలబడి నిరసన తెలిపారు. మున్సిపల్ అధికారులను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ప్రజలు విమర్శించారు. సచివాలయ సిబ్బంది పట్టించుకోవడంలేదన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.బాబూరావు, టి.శ్రీను, నాగరాజు, రమణ పాల్గొన్నారు.

మెడికల్ రిప్స్ సమస్యలు పరిష్కరించాలి

సమ్మెలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మెడికల్ రిప్రజెంటేటివ్‌ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (ఏపీ ఎంఎస్ఆర్‌యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.వి.కష్ణయ్య డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ (ఎఫ్ఎంఆర్ఏఐ) దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా బుధవారం నగరంలోని మెడికల్ రిప్స్ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండోకేర్ సెంటర్లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కష్ణయ్యతోపాటు సిఐటియు సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎం.వి.సుధాకర్ మాట్లాడుతూ కరోనా అనంతరం మెడికల్ రిప్స్ సమస్యలు పెరిగాయని చెప్పారు. పని ఒత్తిడితో, వ్యాపార టార్గెట్లతో ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యాల వేధింపులు పెరగడం దీనికి ప్రధాన కారణమన్నారు. వేతనాలు సక్రమంగా చెల్లించటంలేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడం జరగడంలేదని అన్నారు. ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా మెడికల్ రిప్స్‌ను తొలగించాలని చూస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య రంగంలో చేపడుతున్న విధానాల మూలంగా మెడికల్ రిప్రజెంటేటివ్‌ల ఉపాధి దెబ్బతింటోందని విమర్శించారు. మందులపై జిఎస్‌టి ఎత్తివేయాలని, మందుల ధరలు తగ్గించాలని, నకిలీ మందుల అమ్మకాన్ని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యానికి అవసరమైన నిధులను బడ్జెట్లలో కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనైతిక కార్యకలాపాలకు పాల్పడడం, ఆన్‌లైన్ వ్యాపారాన్ని ప్రోత్సహించడం ప్రజా సంక్షేమం రీత్యా తగదని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా 3 లక్షల మంది, ఏపిలో 15 వేల మంది సమ్మెలో పాల్గొంటున్నారని చెప్పారు. అనంతరం సూర్యారావుపేటలోని వివిధ ఆసుపత్రుల వద్ద సమ్మె ప్రచారాన్ని నిర్వహించారు. నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, మహేష్, మోహన్, హరి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యా దీవెన పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : పేద విద్యార్థులకు విదేశీ విద్య కలగా మిగిలిపోకుండా జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం బాసటగా నిలుస్తుందని ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు ఎస్.డిల్లీరావు, పి.రాజాబాబు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకం కింద ఈ ఏడాది రెండో విడత నిధులను విడుదల చేశారు. అలాగే తొలిసారి నూతనంగా 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. విజయవాడ నుండి కలెక్టర్ డిల్లీరావు, మచిలీపట్నం నుండి కలెక్టర్ రాజారావు పాల్గొన్నారు. కృష్ణాజిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద గత ఏడాది లబ్ధిదారులైన 18 మంది విద్యార్థులకు మూడో విడత కింద కోటీ 77 లక్షల 77 వేల రూపాయలతోపాటు 2023-24లో ఆరుగురు విద్యార్థులకు 2వ విడత రూ.81.59 లక్షలు కలిపి మొత్తం 24 మంది విద్యార్థులకు రెండు కోట్లా 59 లక్షల 36 వేలు విడుదల చేసి నమూనా చెక్కును కలెక్టర్ రాజారావు అందజేశారు. అలాగే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన 8 మంది విద్యార్థులకు రూ.8 లక్షల నమూనా చెక్కుకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బందరు డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ షాహిద్ బాబు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫణి ధూర్జటి పాల్గొన్నారు. విజయవాడ నుండి కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఎన్‌టీఆర్ జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా ఈ విడతలో 32 మందికి దాదాపు రూ. 3.23 కోట్ల మేర సహాయం అందుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్‌సీ సంక్షేమం, సాధికారత అధికారి బి.విజయ భారతి, గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య, రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ అడపా శేషగిరి, భట్రాజ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి దేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ తోలేటి శ్రీకాంత్, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండి శివశక్తి పుణ్యశీల పాల్గొన్నారు.

ధనేకులలో కౌశల్ విజ్ఞాన శాస్త్ర ప్రతిభా పోటీలు

ప్రజాశక్తి - కంకిపాడు : కౌశల్ 2023 విజ్ఞాన శాస్త్ర ప్రతిభా అన్వేషణ పోటీలు విజయవాడ సమీపంలోని గంగూరులో గల ధనేకుల ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జరిగాయి. క్విజ్ పోటీల్లో 8, 9, 10 తరగతుల నుండి ఒక్కొక్కరు చొప్పున 36 టీములు వివిధ పాఠశాల నుండి పాల్గొన్నాయి. అలాగే రెండు థీములలో 36 మంది చొప్పున 72 మంది పోస్టర్ ప్రజెంటేషన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కష్ణాజిల్లా విద్యాశాఖాధికారిణి తాహెరా సుల్తానా చిన్నారులను ఉద్దేశించి స్ఫూర్తివంతమైన సందేశం ఇచ్చారు. సైన్స్ పట్ల ఆసక్తిని కలిగి, జిజ్ఞాసతో పరిశోధనలను చేసినట్లయితే భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని అన్నారు. ఉపాధ్యాయులు ఆదిశగా ఉత్తమ బోధన చేయాలని అన్నారు. పర్యావరణం, వాతావరణ పరిస్థితులు, స్వచ్ఛమైన గాలి భావితరాల వారికి అందేలా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. దనేకుల ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డి.కే. ఆర్.కె.రవిప్రసాద్, ఇజ్రాయిల్ డ్రోనిక్స్ కంపెనీ సిఇఒ నిర్జెండ్లర్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వాగత నత్యం ప్రదర్శించిన ఎన్ లాస్య (గుడివాడ)కు రూ.1000లను ప్రోత్సాహక బహుమతిగా అందించారు. వ్యాఖ్యాతగా కె.వి.ఎస్.ఈశ్వరరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమలో కష్ణాజిల్లా కౌశల్ కోఆర్డినేటర్ సి.హెచ్.బి.వి. పద్మావజి, రావి సురేష్ బాబు (ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల, గంగూరు), సిహెచ్ సురేష్ (కష్ణ యూనివర్సిటీ, మచిలీపట్నం), సి.హెచ్. విద్య (పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విజయవాడ) నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కడియాల రవి చిన్నారులకు బహుమతులు అందించారు.

తుపాను బాధిత రైతులను ఆదుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : తుపాను బాధిత రైతులను ఆదుకోవాలని కోరుతూ బుధవారం విజయవాడ రూరల్ మండలం పి.నైనవరం, పైడూరుపాడు గ్రామాల్లో బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఆయా ప్రాంతాల్లోని సచివాలయ అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన మిచౌంగ్ తుపాను కారణంగా లక్షలాది ఎకరాల్లో రైతులు పంటలను నష్టపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు సరిగా తీసుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తుపాను బాధిత రైతులకు ఎకరానికి రూ.25 వేలు, వాణిజ్య పంటల రైతులకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం మండల కార్యదర్శి ఆంజనేయులు, సిఐటియు మండల కార్యదర్శి తాళ్లూరి నరసింహారావు, దుర్గారావు, సత్తు శ్రీనివాసరావు, రైతులు సూరగాని బుజ్జి, దావ శ్రీనివాసరావు, షేక్ బుజ్జి, హసీఫ్, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **SHAIK ABDUL SALEEM, (Old Name),** S/o. Abdul Raheem, Resident of D.No.12-13-133,134, Pasha Towers, FF-3, 2nd Floor, Abdul Khadar Street, Islampet, Vijayawada (Urban). I have changed my name as **ABDUL SALEEM (New Name),** S/o. Abdul Raheem. Here after my name is known as **ABDUL SALEEM,** S/o. Abdul Raheem.

IN THE COURT OF HON'BLE III ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD
O.P. NO. 1298 of 2017

BETWEEN: -
J. Ramva Sree and others ...Petitioners
V/S
Y.Sridhar and another ...Respondents

To
R-1
Y.Sridhar, S/o Babu Rao,
Owner of Car bearing No. AP. 16. BQ. 3334, R/o H.No. 11-62, Sreelekha Plaza, TF-1, Enikepadu. Vijayawada Rural, Krishna District- 521103.

Please take notice that the petitioners herein has Filed the above O.P.No. 1298 of 2017, claiming compensation against you and another. The said case is posted to **05.01-2024** fur your appearance either in person or through an Advocate. If failed to appear before the Honble Court the said date at 10.30 A.M. the matter will be heard and decide exparte

(BY ORDER OF THE COURT)
M.VENKATAIAH
ADVOCATE
O/o Sree Nilayam, Ist floor, H.No. 3-10-10/A, Gokhale Nagar, Library Lane, Rantanthapur, Hyderabad.
Mobile No. 98482 55392

మొదటిపేజీ తరువాయి

పశ్చిమం మేయర్ భాగ్యలక్ష్మికి?

రసూల్ ఫ్లెక్సీలు కూడా వెలిశాయి. ఇటీవల కొంత మంది ఆర్యవైశ్యులు కార్తీక వనసమారాధనలు కృష్ణానది పున్నమిఘాట్ సమీపంలో చేసుకునేందుకు సిద్ధమైన తరుణంలో ఎంఎల్‌ఎ వెలంపల్లి శ్రీనివాసరావు పోలీసులతో అడ్డుకున్నారని వార్తలు వచ్చాయి. చివరికి ఏదైనా కళ్యాణ మండపంలో కార్తీక వన సమాధారణ పేరుతో సత్యనారాయణస్వామి వ్రతాలు చేసుకుందామని అనుకుంటే కళ్యాణ మండపాలు ఇవ్వద్దని వాటి యజమానులకు హెచ్చరికలు చేసినట్లు సమాచారం. చివరికి ఆర్యవైశ్య పెద్దలు ఈ విషయాన్ని డిజిపి దృష్టికి తీసుకెళ్లి గొల్లపూడిలోని ఓ కళ్యాణ మండపంలో కార్యక్రమం నిర్వహించుకున్నారు. నియోజకవర్గంలో వెలంపల్లి సామాజికవర్గం నుండే వ్యతిరేకత రావడంతోపాటు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చేస్తున్న ప్రయోగాలు కూడా పశ్చిమంలో అభ్యర్థి మార్పుకు కారణంగా కనిపిస్తోంది. వెలంపల్లికి సిఎం మొండిచేయి చూపుతారా లేక మరో నియోజకవర్గానికి పంపుతారా అనేది కూడా తెలియాల్సి ఉంది. సర్వే నివేదికలు వెలంపల్లికి అనుకూలంగా లేవని సిఎం చెప్పినట్లు సమాచారం. ఈ విషయమై వెలంపల్లిని సిఎం తన వద్దకు పిలిపించుకుని మాట్లాడినట్లు తెలిసింది. ఆయనకు విజయవాడ సెంట్రల్ టికెట్ విషయం కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ ఇప్పుడు సీటు ఇవ్వనిపక్షంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మంచి పదవి ఇస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

వైసిపిలో అనూహ్యం !

పెడన కాకుండా మైలవరం నుంచి బరిలోకి దింపాలని చూస్తున్నట్లు తెలిసింది. అలాగే పెనమలూరు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారధిని గన్నవరం ఇన్చార్జిగాను, గన్నవరం ఎంఎల్‌ఎ వల్లభనేని వంశీని వైసిపి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా దింపే ఆలోచనలు చేస్తున్నట్లు తెలిసింది. వంశీ అయితేనే పార్లమెంట్ స్థానం గెలుపు సులువు అవుతుందని భావిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు విజయవాడ పశ్చిమ నియోజవర్గంలో కూడా మార్పులు చోటుచేసుకోనున్నాయి. ప్రస్తుత ఎంఎల్‌ఎ, మాజీ మంత్రి వెలంపల్లికి బదులుగా కొత్త అభ్యర్థిని ఎంపిక చేసే అవకాశం ఉంది. ఇక్కడ బిసిలు, మైనారిటీలతోపాటు వైశ్యులు మెజారిటీగా ఉన్నారు. ఇప్పటి వరకు వైశ్య సామాజికి వర్గానికి చెందిన వెలంపల్లికి రెండుదఫాలుగా అవకాశం కల్పించారు. ఈసారి బిసిలకుగానీ, మైనారిటీలకుగానీ ఛాన్స్ ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిసింది.

ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలి : పుట్టగుంట

ప్రజాశక్తి - హనుమాన్‌జంక్షన్: ఆరోగ్యంపట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్ కుమార్ సూచించారు.బొమ్ములూరు ఫ్యాక్టరీ ఆవరణలో పుట్టగుంట సతీష్ కుమార్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని బుధ వారం ఆయన ప్రారంభించారు. డాక్టర్ కామినేని అచ్యుతాల్రావు ఆధ్వర్యంలో ఆంధ్రహాస్పటల్, అమరావతి ఐ హాస్పటల్, మణిపాల్, మాక్సివిజన్కు చెందిన సూపర్ స్పెషాలిటీ వైద్యులు 167మందికి గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, నరాలు, ఎముక సాంద్రత తదితర ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు.

వృద్ధులకు వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం స్థానిక రామ్ నగర్ లో గన్నవరం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తిరిబిది వెంకయ్య పేద బలహీన వర్గాలకు చెందిన వృద్ధ మహిళలు 100 మందికి , పురుషులకు 30 మంది కి నూతన వస్త్రాలు బుధవారం పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా చీరలను, పురుషులకు వస్త్ర దానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన క్రిస్మస్ ఆనందం పేదలకు సహాయం చేయడం లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాచేటి ఋతుమ్మ , కలపాల బుల్లియ్య, బొకినాల కోటేశ్వరరావు , జన్ను నారాయణ, వి. ఏలీషా వల్లూరి చక్రవర్తి, పొలిమేర పీటర్ తదితరులు పాల్గొన్నారు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నవజీవన్ విద్యా సంస్థల కరస్పాండెంట్ కొండవీటి ఈశ్వరరావు స్టడీ మెటీరియల్ అందజేశారు. బుధవారం జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లి ఆయన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసి పలు సూచనలు చేశారు. లక్ష్యంతో కష్టపడి చదివితే విజయం సాధించవచ్చు నన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం లోని స్థానిక నిజాం పేట ఏరియాలో నివసిస్తున్న ఒక మహిళకు వివాహం అయి ఏడుసంవత్సరాలుకాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త చెడు వ్యసనాలకు లోనై వదిలివేసి వెళ్లగా స్కూల్ ఫీజులు కట్టలేక పోవడం కారణంగా పిల్లలు కూడా ఇంటివద్దనే ఉండడం, ఇల్లు కూడా గడవక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆ మహిళ కుటుంబానికి మైత్రి ఫౌండేషన్ ద్వారా బుధవారం పది వేలరూపాయల ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్ర మంలో సంస్థ అధ్యక్షులు కె వేణు కుమార్, ఉపాధ్యక్షులు గంగయ్య నాయుడు, కార్యదర్శి రాధాకృష్ణ పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీ అబెండర్ భీమవరపు వెంకటేశ్వరరావు మంగళవారం మతి చెందారు. అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు బుధవారం వెంకటేశ్వర ర్పార్థివదేహాన్ని రావు సందర్శించి పూలమాలవేసి నివాళ లర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. శాసనసభ్యులు రమేష్ బాబు తో పాటు రమేష్ బాబుతో పాటు చల్లపల్లి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నాని), లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ కొల్లూరు కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకా నాథ్, లక్ష్మీపురం, చల్లపల్లి మండల నాయకులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టం ఉపసంహరించాలని దీక్ష

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : భూహక్కుల చట్టం 2023 ను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ మచిలీపట్నం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రధాన గేటు ముందు రిలే నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా పలువురు న్యాయ వాదులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూహక్కుల చట్టం -2023 ను వెంటనే ఉపసంహరించు కోవాలని కోరుతూ రాష్ట్రంలోని పలువురు న్యాయ వాదులు రిలే నిరాహారదీక్షల శిబిరాన్ని రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో నిర్వహిస్తున్నారన్నారు. భూమి కి సంబంధించిన సివిల్ వివాదాలను ఇప్పటివరకు సివిల్ కోర్టులు విచారించి, తీర్పులు చెప్పేవి.అయితే భూ సంభందిత కేసులు సివిల్ కోర్టుల్లో ఎక్కువ కాలం పెండింగ్ లో ఉంటున్నాయనే కారణంగా, వీటి సత్వర పరిష్కారం కోసం అని రాష్ట్ర ప్రభుత్వం భూహక్కుల చట్టం 2023 ను తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం లోపభూయిష్టంగా ఉందని ,ఈ చట్టం వలన ఆస్తి రక్షణ హక్కు సామాన్యుడి నుండి తీసివేశారన్నారు. ఈ చట్టం ప్రకారం భూవివాదాల పై సివిల్ కోర్టులకు వెళ్లే అధికారం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల

సంఘం అధ్యక్షుడు, తుంగల హరిబాబు, ప్రధాన కార్యదర్శి, కొట్టే రఘురాం, న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షులు, లంకి శెట్టి బాలాజీ, పుప్పాల ప్రసాద్, న్యాయవాదులు, బూరగడ్డ అశోక్ కుమార్, సిద్దినేని సాయిబాబు,కేజే భాగ్యరాజ్, జీవీఎల్ నరసింహారావు, కూనవు రెడ్డి శ్రీనివాస్, న్యాయవాదుల గుమస్తాల సంఘం ప్రధాన కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్ తదితరులు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. వారికి మద్దతుగా, ప్రముఖ వైద్యులు, డాక్టర్ బి ధన్వంతరి ఆచార్య, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, గొర్రెపాటి గోపీచంద్, తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు, చిత్తజల్లు నాగరాము, డి సుధాకర్ తదితరులు న్యాయ వాదుల రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు.

పంటలు నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : తుపాను వల్ల పంటలు తీవ్రంగా నష్టపోయి కోడూరు అవనిగడ్డ మండలాలకు చెందిన రైతులు ఆత్మహత్యా యతనానికి పాల్పడ్డారని, తక్షణమే ప్రభుత్వం ఆ కుటుంబాలను ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కౌలు రైతుల సంఘం రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలం అశ్వరావు పాలెం గ్రామానికి చెందిన కౌలు రైతు తక్కెళ్ళ వెంకటపూర్ణయ్య ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆయనను రైతు సంఘం నాయకులు శీలం నారాయణరావు ఆవుల బసవయ్య, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు మాతిబోయిన పులేందర్ రావు లతో కూడిన బందం తక్కెళ్ళ వెంకటపూర్ణయ్యను పరామర్శించి ఆయన కుటుంబానికి ఆయనకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ కవులు రైతులకు నిబంధనల పేరుతో గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదన్నారు. దీనితో పంటలు నష్టపోయినప్పుడు పంట నష్టాన్ని యజమానులు పొందుతున్నారు తప్ప కవులు రైతులకు అందడం లేదన్నారు. పెట్టుబడి పెట్టి ప్రకృతి వైపరీత్యాలకు నష్టాలకు గురవుతున్న కౌలు రైతులకు నష్టపరిహారం అందకపోవడంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు బండి ఆదిశేషు పోలా బత్తిన

అవనిగడ్డలో రైతును పరామర్శిస్తున్న నాయకులు

మోహన్ రావు కర్ర వెంకటేశ్వరరావు లు పాల్గొన్నారు

ప్రజాశక్తి-కంకిపాడు : తుఫాన్ వల్ల చేతికి వచ్చిన పంట వర్షం పాలవటంతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని వారిని ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కంకిపాడు డిప్యూటీ తహసిల్దార్ కు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ఎకరానికి 25వేల రూపాయలు ఇవ్వాలని, రెండో పైరు అపరాలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ శ్రీహరి, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పి మరీదాసు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వై జోజి పాల్గొన్నారు.

నియామకపత్రం అందుకుంటున్న భుజంగం నాయక్

ఆదివాసి కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా భుజంగం నియామకం

ప్రజాశక్తి-పమిడిముక్కల : పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ అనేక కార్యక్రమాల రూపొందించిందని, అని ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ రైతులకు మేలు చేసిందని రాష్ట్ర ఆదివాసి కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బాణావతి భుజంగం నాయక్ అన్నారు. తనను ఆదివాసి ఉపాధ్యక్షులుగా నియమితులు చేసిన సందర్భంగా బుధవారం మండలంలోని కూడేరు గ్రామంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ఆదివాసి రాష్ట్ర అధ్యక్షులు పి శాంతకుమారికి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగురోజు, సంజీవ్‌రెడ్డి, ధనేకుల మురళీ, మొవ్వ మోహనరావు, కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి సేవ చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఐదవ వార్డులోని సైబర్ జోన్ కంప్యూటర్ సెంటర్లో స్వామి వివేకానంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రెండో బ్యాచ్ ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ ఎం ఈశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 రోజులపాటు ఉచితంగా కంప్యూటర్ లో శిక్షణ ఇచ్చి ప్రతిభగలవారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించనున్నట్లు చెప్పారు. జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష తదితరులు పాల్గొన్నారు

ఫంగస్ చేపల రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: కనీసమద్దతు ధరలేక గత సంవత్సరకాలంగా నష్టాల ఊబిలో చిక్కుకున్న ఫంగస్ చేపలరైతులు సమిష్టి నిర్ణయాలతో మాత్రమే కనీసమద్దతు ధరతో నష్టాల నుండి గట్టెక్కగలమని ఆక్వారైతు ఉమాశంకర్‌రెడ్డి సూచించారు. ఆరుగొలనులోని యంఎస్సార్ ఆక్వా ఫీడ్ ఆవరణలో ఉమాశంకర్‌రెడ్డి నేతృత్వంలో కృష్ణా, గోదావరి జిల్లాల ఆక్వారైతులు (ఫంగస్ చేప పెంపకం దారులు) సమావేశం బుధవారం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫంగస్ చేప పెంపకం దారులు తీవ్ర నష్టాల్లో ఉన్నామన్నారు. చేపల సాగులో మేతధర, ఇతర వ్యయాలు అధికం కావడంతో వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్నామని, గత ఏడాదికాలంగా కనీస మద్దతు ధర లేక పెట్టుబడి కూడా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేశవరావు, నారాయణ, గోదావరి జిల్లా నుండి పెద్దిరెడ్డి రాము, ఎలకపల్లి రవి, తదితరులతో పాటు కృష్ణా, గోదావరి జిల్లాలకు చెందిన ఆక్వా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎఎఎన్ఎమ్ అండ్ వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఈనెల 18, 19వ తేదీలలో విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాలకు నిర్వహించిన ప్రాంతీయ బాలుర ఆటల పోటీలలో స్థానిక ఎఎఎన్ఎమ్అండ్‌వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం రాజశేఖర్ తెలిపారు. బాలుర గేమ్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్, బాలుర స్పోర్ట్స్ ఓవరాల్ షిప్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ లతోపాటు స్పోర్ట్స్ ఏ భాగంలో తతీయ సంస్థ విద్యార్థి పి వివేక్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ ను దక్కించుకున్నారు. బాలుర గేమ్స్ వాలీబాల్, కబడ్డీ, బాల్మెంటన్, టేబుల్ టెన్నిస్ డబుల్స్ మరియు చెస్ విభాగాలలో విన్నర్స్ గా నిలిచారు. అదేవిధంగా బాలుర స్పోర్ట్స్ విభాగంలో రన్నింగ్ విభాగంలో 200 మీ,400మీ, 800మీ,1500మీ,400మీఐ400 రిలే విభాగంలో మొదటి స్థానం, 400మీఐ400 రిలే లో తతీయ స్థానం, ట్రిపుల్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో విభాగాలలో మొదటి స్థానం, జావలిన్ త్రో విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాధించారు. విజేతలకు గుంటూరు పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ తాళ్లూరు శేఖర్, విజయవాడ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎం విజయ సారథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు జిల్లా పరిషత్ పాఠశాలలో కృష్ణా జిల్లా స్థాయి ప్రభుత్వ పాఠశాలల విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం జరిగింది. జిల్లాలోని సుమారు 25 మండలాల నుండి విద్యార్థులు పాల్గొని వివిధ వైజ్ఞానిక పటాలతో చిత్రాలతో ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనను జిల్లా విద్యాశాఖ అధికారి తాహెర సుల్తానా ప్రారంభించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ముఖ్యఅతిథిగా కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యుత్ తో పాటు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ సి ఆర్ పి కోఆర్డినేటర్ భాగ్యశ్రీ, ఫ్యాకల్టీ శివకుమారి, మచిలీపట్నం డివైఈవో జిల్లా సైన్స్ ఎడ్యుకేషన్ ఇన్చార్జి జాకీర్ అహ్మద్ మండల తాసిల్దార్ మస్తాన్‌రావు, జడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్, ప్రధానోపాధ్యాయులు పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సమగ్ర శిక్షా లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్షా కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (జెఏసి)కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం నుండి కృష్ణా జిల్లా కలక్టరేట్ ధర్నా చౌక్ లో నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు పి. పోతు రాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.హామీ ఇచ్చి నాలుగున్నర ఏళ్లు అవుతున్న ఇప్పటి వరకు అమలు చేయలేదని దీంతో సమ్మె చేపట్టాల్సి వచ్చిందన్నారు. కాబట్టి ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉద్యోగులను రెగ్యులర్ చేయండి లేదా కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.శివ నాగరాజు మాట్లాడుతూ గౌరవ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కోశాధికారి బూర .సుబ్రమణ్యం సంఘీ భావం తెలిపారు. సంఘం కోశాధికారి ఎం.ప్రశాంతి,తో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గౌడ్ సంఘం అధ్యక్షులు కళ్యాణ్ మృతి

ప్రజాశక్తి-పెడన : పెడనకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, గౌడ సంఘ పట్టణ అధ్యక్షులు పడమట నాగ కళ్యాణ్ సతీష్(బాబి) బుధవారం మృతి చెందారు. గత కొంతకాలంగా ఈయన శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో చికిత్స పొందుతున్నారు. నియోజవర్గ టిడిపి ఇంచార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు బెజవాడ నాగరాజు, నాయకులు తోట పైడేశ్వరరావు, తోట మురళి తదితరులు నివాళులర్పించారు.

భూపంపిణీ చేయాలని వినతి

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ రెవెన్యూ పరిధిలో ఆర్ ఎస్ నంబర్ 323లో 22 యకరాలు 22 సెంట్ల భూమి ని ప్రభుత్వం సర్వే చేసి హనుమంతుపాలెం గ్రామ ఎస్ సి, ఎస్టీలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నందిగామ ఆర్డీఓ పి. సాయిబాబుకు హనుమంతుపాలెం గ్రామ దళితులు, గిరిజనులు వినతిపత్రం అందజేశారు. భూమిపై యాజ మాన్యపు హక్కు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, సయ్యద్ ఖాసిం లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతుపాలెం గ్రామ దళితులు, గిరిజనులు పాల్గొన్నారు.

నందిగామలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణం, 16 వ వార్డులో బుధవారం "గడపగడపకు- మన ప్రభుత్వం" కార్యక్రమం నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్‌రావు నిర్వహించారు. ఉదయం ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల బుక్ లెట్‌లను ప్రజలకు అందజేశారు. అవినీతి,లంచగొండి తనంకు ఆస్కారం లేని తమ ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలని కోరారు. నందిగామ మార్కెట్ యార్డ్ చైర్మన్ మస్తాన్, మున్సిపల్ కమిషనర్ జయరాం, వైస్ చైర్మన్ లక్ష్మీ, ఏఈ, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-కంచికచర్ల : జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపిపి షేక్ బషీర్ అన్నారు. కంచికచర్ల మండలం పెండ్యాల లో జగనన్న కాలనీల్లో జేసీబీ తో జంగిల్ క్లియరెన్స్ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండ్యాల లో 610 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. ఈ కాలనీ లో ఇప్పటికే కొందరు లబ్దిదారులు ఇళ్ళు నిర్మాణం పూర్తి చేయగా, కొందరు నిర్మాణం చేపట్టారన్నారు. అయితే కాలనీ కంపచెట్లుం మెలిచి ఇబ్బందిగా మారిందన్నారు. లబ్దిదారులు ఇళ్ళు నిర్మాణాలకు అనువుగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ సంస్కారం తో నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కషి చేసినట్లు తెలిపారు. లబ్దిదారులు త్వరిత గతిన ఇళ్ళు నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు.

లంక భూములకు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల పరిధి లోని జూపూడి గ్రామంలో లంక భూములను సాగు చేసుకుంటున్న లబ్ధిదారులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు లంక భూములకు పట్టాలను పంపిణీ వెల్లడించారు. జూపూడి గ్రామంలో 4 సొసైటీల పరిధిలో 241 మందికి 213 ఎకరాల విస్తీర్ణంలో భూములను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చెట్ల పెంపకానికి శ్రీకారం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పట్టణం పచ్చ దనాలను పరుచుకోనుంది. అహ్లాద, కాలుష్యరహిత వాతావరణాన్ని వెదజల్లనుంది. "చెట్లను పెంచు ఆరోగ్యాన్ని పంచు" నానుడిని నిజం చేస్తూ ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను జగ్గయ్యపేటలో రూ. 20 లక్షలు వెచ్చించి చెట్ల పెంపకానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం రాజమండ్రిలోని కడియం నర్సరీని రాష్ట్ర ప్రభుత్వవిప్, సామినేని ఉదయభాను మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సందర్శించి వివిధ రకాల మొక్కలను సేకరిం చారు. వాటిని త్వరలో జగ్గయ్యపేటకు తెప్పించి పట్టణంలో పలు ప్రాంతాల్లో నాటనున్నారు.

కౌలు రైతులకు నష్టపరిహారం కోరుతూ ఆందోళనలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి కరువును అంచనా వేయడంలో ఉదాసీనంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కరువు పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుకురావడంలో తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి వి ఆంజనేయుల్ను అన్నారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో బుధవారం తుపాన్ వల్ల నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు నష్టపరిహారం అందించాలని కోరుతూ గ్రామ కార్యదర్శి సిహెచ్ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కరువు పరిస్థితులను అంచనా వేయటం లోనూ, వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించి అమలు చేయడంలోనూ, కరువు సహాయక చర్యలు చేపట్టడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి కారణంగా రాష్ట్రంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్రమైన ఆందోళనతో ఉన్నారన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటలను బట్టి రైతులు, కౌలు రైతులను గుర్తించి భూ యజమానులకు కాకుండా కౌలు రైతులకు నష్టపరిహారం వచ్చేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌడ్ రైస్ సంఘం మండల కార్యదర్శి దంతాల వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోటా కష్ణ, రైట్కతు సంఘం నాయకులు కె లింగారావు, సిఐటియు నాయకులు షేక్ గౌస్ మియా, కే ఆదినారాయణ, ఎం శ్రీను, గడ్డం రామకష్ణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చందర్లపాడు** : మండలంలోని కొడవటికల్లు గ్రామ సచివాలయం వద్ద బుధవారం కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో మిచౌంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతు,కౌలు రైతులకు పంట నష్టపరిహారం వెంటనే అందించాలని ఆందోళన నిర్వహించారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ ఈ క్రాఫ్ట్ నమోదు కాని కౌలు రైతులు, రైతులకు కూడా నష్ట పరిహారం ఇవ్వాలని అన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుఫాను వల్ల పూర్తిగా దెబ్బతిని రైతులు కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం మండల అధ్యక్షుడు గుమ్మళ్ల ఏడుకొండలు,నాగినేని వెంకట రామారావు,జంపాని వెంకటేశ్వరరావు, ఎం పరమేశ్వరరావు,ఎన్ హనుమంతరావు సి.హెచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఏ కొండూరు** : తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి వెంటనే ఆదుకోవాలని రైతు సంఘం మండల కార్యదర్శి ఆళ్ళ అమ్మిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు బుధవారం రైతు సంఘం కౌలు రైతు సంఘం వ్యవసాయ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మండలములోని చీమలపాడు గ్రామంలో రైతు భరోసా కేంద్రం లో ఉద్యాన శాఖ సహాయకులు వెంకటేశ్వరకు వినతి పత్రం అందజేశారు. ఈ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పి అనంతరావు ఎస్ మోహన్ రావు బి సాంబయ్య వై పుల్లారావు కే మోహన్ రావు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో...

చందర్లపాడులో...

ఘనంగా ఎన్ఎస్ఎం స్వర్ణోత్సవం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్ స్వర్ణోత్సవ వేడుకలు బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలిరోజు వేడుకలను ప్రొవెన్షియల్ సుపీరియన్ బ్రదర్ షైన్ అలెక్స్, టిఎఓ డిజిటల్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు వెలగపూడి రాజ్‌కుమార్, పివిపి వెంచర్స్ చైర్మన్ పొట్లూరి వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు అన్ని రంగాలలో ఉత్తములుగా ఉండేందుకు విశేష కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో

అసిస్టెంట్ జనరల్ బ్రదర్ ప్రతాప్‌రెడ్డి, కరస్పాండెంట్ బ్రదర్ మౌంట్‌ఫోర్ట్, ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్పరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు మ్యాథ్స్ క్విజ్

ప్రజాశక్తి - తిరువూరు : జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గణిత సప్తాహంలో భాగంగా.తిరువూరు మండలంలోని గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మ్యాథ్స్ క్విజ్ నిర్వహించారు. సీనియర్ గణిత ఉపాధ్యాయుడు ఎస్.వి.బి. రాజేంద్ర ప్రసాద్ క్విజ్ మాస్టర్ గా వ్యవహ రించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు జి.ఆదిలక్ష్మి, గణిత ఉపాధ్యాయులు ఎం. సాంబశివరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. ఈ క్రికెట్ పోటీలలో ప్రథమ విజేతలుగా ఫ్రెండ్స్ యూత్ జగ్గయ్యపేట, ద్వితీయ విజేతలుగా చిన్నా యూత్ చిల్లకల్లు వారు గెలుపొందారు. గెలుపొందిన విజేతలకు మాడుగుల సురేష్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోలపల్లి తేజ్ కిరణ్, నల్లమోతు శ్రీరామ్ మరియు ఆర్టీసీ డిపో మేనేజర్ రఘురాం, సూపర్నెండెంట్ నాగేశ్వరరావు, క్రికెట్ ఆర్గనైజర్ కమిటీ సభ్యులు, క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

26 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా మున్సిపల్ వర్కర్స్ ని పర్మినెంట్ చేయాలని డిసెంబరు 26 నుంచి సమ్మె చేయనున్నట్లు సిఐటియు ఆధ్వర్యంలో కొండపల్లి మున్సిపల్ కమిషనర్ కు సమ్మె నోటీసు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారిశుద్ధ్య , ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులు డిసెంబర్ 26 నుండి నిరవదిక సమ్మె చేస్తున్నామని తెలియజేశారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పడుతున్నట్లు సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్, పారిశు ధ్య కార్మికులు రమణ సురేష్ మణికంఠ లక్ష్మయ్య శ్రీను అంకలు, రత్నారావు లతో కలిసి బుధవారం కొండపల్లి మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు కి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ డిసెంబర్ 26వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సమ్మెబాట పడుతున్నారని

తెలియజేశారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిగా అమలు చేయాలని ఇంకా పలు డిమాండ్లపై సమ్మె బాట పడుతున్నామని తెలియజేశారు.

కళ్యాణ మండపానికి భూమిపూజ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారి దేవస్థానం (పెద్ద శివాలయం) నందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకారంతో, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను కషితో 40 లక్షల సిజిఎఫ్ ఫండ్స్ తో నూతనంగా నిర్మించే కళ్యాణ మండపానికి బుధవారం యువజన నాయకులు సామినేని వెంకటకష్ణ ప్రసాద్ బాబు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ 40 లక్షలు సిజిఎఫ్ ఫండ్స్, 20 లక్షలు దాతల సహకారంతో నిర్మించే ఈ కళ్యాణ మండపం త్వరలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు గిల్లా పూర్ణచంద్రరావు, సంగిశెట్టి శ్రీరంగమ్మ, పల్లపోతుల గీతా విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఉద్యోగుల దీర్ఘకాలిక ఆకాంక్షను నెరవేర్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చరిత్ర సష్టించారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని డిపో సెంటర్ సామినేని విశ్వనాథం కార్మిక నగర్ నందు పిటిడి వైయస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన భవనాన్ని బుధవారం సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లా డుతూ పిటిడి వైయస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనాన్ని ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఆర్టీసీని ప్రభుత్వంలోనికి విలీనం చేసి లక్షలాదిమంది ఉద్యోగుల జీవితాలకు ప్రగతిబాట వేశారన్నారు. రాష్ట్ర అధ్యక్షులు చల్ల చంద్రయ్య, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ రాజు, పట్టణ పార్టీ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, ప్రభుత్వ హాస్పిటల్ అభివద్ధి కమిటీ సభ్యులు కటారి హరిబాబు, పట్టణ పిటిడి వైయస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి- నందిగామ : ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా గ్రామ సచివాలయ - వాలంటీర్ వ్యవస్థ పని చేస్తుందని నందిగామ ఎంఎల్ఎ మ్నొండితోక జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. రామన్నపేట గ్రామంలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు బుధవారం పూజ నిర్వహించి, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.